# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- డిజిటల్ నెర్వ్ సెంటర్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు కుప్పం ఏరియా ఆసుపత్రిలో ఆవిష్కరించారు.
- ఉత్తరాంధ్రలో పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
- వినియోగదారులకు అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.
- రుషికొండ బీచ్ లో బ్లూ ఫ్లాగ్ ప్రమాణాల స్థాయిని కొనసాగిస్తామని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.
- 2వ జాతీయ లోక్ అథాలత్ ఈ నెల 5వ తేదీన జరగనుంది.

==============================

రోగుల వైద్య రికార్డులను ఆసుపత్రులు, ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాలతో అనుసంధానం చేసే డిజిటల్ నెర్వ్ సెంటర్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం ఏరియా ఆసుపత్రిలో ఈరోజు ఆవిష్కరించారు. గేట్స్ ఫౌండేషన్, టాటా సంస్థల సహకారంతో ఈ డిజినెర్వ్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తో కలిసి ముఖ్యమంత్రి కుప్పం నియోజకవర్గంలోని 13 ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాలను డిజినెర్వ్ సెంటర్ తో అనుసంధానించారు. వైద్య సేవల్ని మరింత విస్తృతం చేసేందుకు వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఈ సందర్బంగా ఆయన పలు సూచనలు జారీ చేశారు. కుప్పంలో అమలు చేస్తున్న డిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రపంచానికే నమూనాగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. డిజినెర్వ్ సెంటర్ తో ఏఎన్ఎంలు, అంగన్వాడీ కేంద్రాలను కూడా అనుసంధానం చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యులతో ఈ సందర్బంగా ముఖ్యమంత్రి వర్చువల్ గా సంభాషిస్తూ…

(వాయిస్ 35 సెకన్లు)

==============================

ఉత్తరాంధ్ర ప్రజలకు సాగు, తాగు నీటినందించే లక్ష్యంతో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేలా ప్రయత్నం చేస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులపై మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. 90 శాతం పనులు పూర్తైన వంశధార ఫేజ్-2, తోటపల్లి బ్యారేజ్ పనులను గత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందన్నారు. నిధుల కొరతతో నిలిచిపోయిన ఆండ్ర రిజర్వాయర్, రైవాడ, పెద్దంకలం, పెద్దగడ్డ, వట్టిగెడ్డ ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి ఉత్తరాంధ్ర పెండింగ్ ప్రాజెక్టులపై వచ్చే వారం సమీక్ష చేపట్టనున్నారని.. అప్పటికి ఏ ఏ పనులకు ఎంతెంత ప్రాధాన్యం ఇవ్వాలి.. పూర్తి చేయడానికి ఎంత సమయం పడుతుంది తదితర వివరాలతో సమగ్ర నివేదికలతో సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులకు ఈ సందర్భంగా మంత్రి సూచించారు.

==============================

రుషికొండ బీచ్ లో బ్లూ ఫ్లాగ్ ప్రమాణాల స్థాయిని కొనసాగిస్తామని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. విశాఖపట్టణంలోని రుషికొండ బీచ్ లో ఈరోజు పర్యటించిన మంత్రి బీచ్ లో పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. బీచ్ లో దుకాణాలు నడుపుతున్నవాళ్లు, లైఫ్ గార్డులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలకు తగిన పరిష్కారం చూపిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. పరిశుభ్రత, భద్రత, పర్యావరణ నిర్వహణ, ట్రాఫిక్ మేనేజ్ మెంట్, ఘన వ్యర్థాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు తదితర అంశాలను జిల్లా యంత్రాంగం ఇతర శాఖల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం త్వరలో బీచ్ రోడ్డులో తిరగనున్న డబుల్ డెక్కర్ ఈవీ బస్సులను పరిశీలించారు. పర్యాటక ఆకర్షణగా నిలవబోతున్న హప్ ఆన్, హప్ ఆఫ్ ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు త్వరలోనే విశాఖలో సేవలందించనున్నాయని మంత్రి తెలిపారు.

==============================

విభిన్న ప్రతిభావంతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు తీసుకొచ్చాయని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖా మంత్రి రాందాస్ అత్వాలే అన్నారు. చిత్తూరులో స్థానిక కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన దివ్యాంగులకు అవసరమయ్యే పరికరాలు, కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో కలిసి కేంద్రమంత్రి రాందాస్ అత్వాలే పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు వీల్ చైర్లు, కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. అనంతరం రాందాస్ అత్వాలే మాట్లాడుతూ… 2047 సంవత్సరానికి దేశం "వికసిత్ భారత్'గా మారనుందని.. ఆ ప్రయాణంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు.

విరామం

==============================

వినియోగదారులకు అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని ఏలూరు గ్రామంలో 4 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 33/11 కె.వి. విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఈరోజు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ… జిల్లాలో లో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి అవసరమైన ప్రాంతాల్లో సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే 6 సబ్ స్టేషన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ప్రధానమంత్రి "సూర్య ఘర్ పథకం" ద్వారా ప్రతి నియోజకవర్గానికి 10 వేల కనెక్షన్లు మంజూరు చేయడం జరిగిందని.. వాటిని కూడా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పేర్కొంటూ…

(వాయిస్ 29 సెకన్లు)

==============================

అపరిష్కృతంగా ఉన్న ఆస్తి తగాదాలు, సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులను ఈ నెల 5వ తేదీన నిర్వహించే 2వ జాతీయ లోక్ అథాలత్ లో పరిష్కరించుకోవచ్చని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి హిమబిందు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి లక్షా 15 వేల 071 కేసులను గుర్తించామని చెప్పారు. మధ్యవర్తిత్వంలో కేసుల పరిష్కారం కోసం దేశ వ్యాప్తంగా “మీడియేషన్ ఫర్ ద నేషన్ క్యాంపైన్”ను సెప్టెంబర్ 30వ తేదీ వరకు 90 రోజుల పాటు నిర్వహిస్తున్నామని చెప్పారు. దీనికోసం రాష్ట్రంలో 893 మందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. మీడియేషన్ ఫర్ ద నేషన్ క్యాంపైన్, లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీచేసుకుంటే ఇరు పక్షాలు విజయం సాధించినట్లే అని హిమబిందు పేర్కొంటూ…

(వాయిస్ 34 సెకన్లు)

==============================

ఏలూరు నగరంలోని రైల్వే స్టేషన్‌లో ఈగల్ టీం ఐజి రవికృష్ణ, జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఇతర పోలీస్ అధికారులతో కలిసి ఈరోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆపరేషన్ విజయ పేరుతో విస్తృత తనిఖీలు చేపట్టారు. అనంతరం ఈగల్ టీం ఐజి రవి కృష్ణ మాట్లాడుతూ… రాష్ట్రవ్యాప్తంగా ఈగల్ టీం ప్రారంభించిన అప్పటి నుండి ఇప్పటి వరకు 21 వేల 736 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో డ్రోన్ సహాయంతో సాగు చేస్తున్న గంజాయి పంటను గుర్తించి వాటిని నాశనం చేశామని తెలిపారు. గంజాయి పంటను పూర్తిగా ధ్వంసం చేసినప్పటికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి ఒరిస్సా నుండి చిన్నచిన్న మొత్తాలలో గంజాయిని సరఫరా చేస్తున్నట్లు తాము గుర్తించామని, వీటిని నిర్మూలించేందుకే రైళ్లల్లో ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని రవికృష్ణ వివరించారు.

==============================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి మరియు పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజులు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే  అవకాశముందని పేర్కొంది. బలమైన ఈదురు గాలులు గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో వీయవచ్చని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

==============================
==============================